క్లుప్తంగా

మనువాద ప్రతుల దహనం

చిల్లకూరు: భారతదేశంలో మనువాదాన్ని ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసిన సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ 1927 డిసెంబర్ 25న మనువాద ప్రతులను దహనం చేశారు. దీని కొనసాగింపుగా బుధవారం ఏరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మనువాద ప్రతులను కేఎన్‌పీఎస్ నేతలు దహనం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కావలి బాలయ్య, పోలయ్య, నాగేంద్ర, బీరయ్య, కనకయ్య, జోషి, చెన్నయ్య పాల్గొన్నారు.

షేక్ హసీనాకు డాక్టరేట్



చిల్లకూరు: గూడూరుకు చెందిన షేక్ హసీనాకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు బుధవారం ఆమె తెలిపారు. సాధుపేటకు చెందిన షేక్ హసీనా ఎస్వీయూలో గణిత శాస్త్ర విభాగంలో 'సమ్ స్టడీస్ ఆన్ (సిగ్మా వన్) రివర్స్ డెరివేషన్ ఇన్ రింగ్స్' అనే అంశంపై ఆచార్య సి.జయసుబ్బారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసి పత్రాలను సమర్పించగా వర్సిటీ తన పరిశోధనలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

ముగిసిన శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో వారం రోజులుగా జరుగుతున్న జేఎన్‌టీయూఏ ఖోఖో మహిళల జట్టు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసినట్లు పీడీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన జట్టు ఈనెల 28 నుంచి కేరళలోని క్యాలికట్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే అంతర వర్సిటీ ఖోఖో క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి జట్టు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

కండలేరులో 57.008 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 57.008 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 750 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 520, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 140, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీడని ముసురు

- చలి గాలులతో ప్రజలు గజగజ



మేఘావృతంగా ఉన్న ఆకాశం

చిల్లకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతుండడంతో తీర ప్రాంతంలోని ప్రజలు చలికి గజగజలాడిపోతున్నారు. ఒక వైపు వీడని ముసురు గత రెండు రోజులు నుంచి కమ్ముకుని ఉండగా బుధవారం ఓ మోస్తరు వర్షం కురుస్తూ చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇల్లు వదలి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గూడూరుతోపాటు చిల్లకూరు మండలంలో చలి గాలులు విపరీతంగా వీస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ ముసురు వీడక, చలిగాలులు తగ్గక పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

దయామయ.. కరుణించు



చిల్లకూరు: మోమిడి చర్చిలో సంబరాలు



వెంకటగిరిలో ప్రార్థనలు



రామారెడ్డికండ్రిగ చర్చిలో..



కోట: హోలీప్రేయర్ చర్చిలో..



చిల్లకూరు: ఏరూరు లూథరన్ చర్చిలో..

క్రిస్మస్ పండుగను బుధవారం నియోజకవర్గంలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లోని చర్చిలు, ఇళ్ల వద్ద ఆనందోత్సాహాల మధ్య పండుగను వేడుకగా నిర్వహించారు. క్రిస్మస్ శాంతి సందేశాలు, ప్రత్యేక ప్రార్థనలు, ఏసు గీతాలు ఆలపించారు. చర్చిలు, ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పలు చర్చిలలో బిషప్‌లు, పాస్టర్‌లు బైబిల్ సందేశాలు వినిపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ సంబరాలు
- ప్రార్థనలతో పులకించిన చర్చిలు, మందిరాలు
- పలు సేవలతో దాతృత్వాన్ని చాటిన క్రైస్తవులు
- అలరించిన ఏసు గీతాలు
- ఆకట్టుకున్న శాంతాక్లాజ్ వేషధారణలు





పెళ్లకూరు చర్చిలో.., నాయుడుపేట: ఆశీర్వాదం అందిస్తున్న బిషప్ మైకెల్‌బెన్‌హర్

పెళ్లకూరు: మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బైబిల్ క్విజ్ నిర్వహించి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఓజిలి: మండలంలో ఘనంగా నిర్వహించారు. కురుగొండ చర్చిలో డాక్టర్ అంకయ్య క్రైస్తవులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఓజిలి లూథరన్ చర్చిలో జాన్సన్ వేడుకగా నిర్వహించారు. ఓజిలిలో చర్చి ఆవరణలో 20 అడుగుల ఎత్తు ఉన్న క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. అలాగే ప్యారిష్‌లోని వేముగుంటపాళెం చర్చిలో క్యాండిళ్లు వెలిగించి ప్రార్థనలు చేశారు.

దొరవారిసత్రం: మండల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ప్రత్యేక గీతాలు ఆలపించారు.

నాయుడుపేటటౌన్: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బేరిపేటలోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి, రోమన్ క్యాథలిక్ చర్చి, హెబ్రోను ప్రార్థనా మందిరం, విన్నమాలలోని జీసస్ గ్రేస్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: పట్టణంలోని కాశీపేట లూథరన్ చర్చి, నాగులగుంటపాళెం, చింతగుంట, ఏపీటీఎఫ్ కాలనీ, కోళ్లఫారం, కుమ్మరిగుంట, బంగారుపేట చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

కోటలో

కోట: ఏసుక్రీస్తు బోధనలు లోకానికి రక్షణ అందించాయని బిషప్ ప్రదీప్‌కుమార్ అన్నారు. విద్యానగర్ హోలీ ప్రేయర్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. రెవరెండ్ డేన్నీ పాల్గొన్నారు. కోట బెరాకా ఆరాధన మందిరంలో సంఘ కాపరి నోవాబాబు సందేశమిచ్చారు.

సైదాపురంలో..

సైదాపురం: సైదాపురం, కలిచేడు, ఊటుకూరు, చాగణం, మర్లపూడి గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మోమిడి, ఏరూరు, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం, పల్లమాల, అన్నంబాక, ఓడూరు, చిల్లకూరు గ్రామంలోని లూథరన్ సంఘాలలో వాక్య సందేశం ఇచ్చారు.



నాయుడుపేట: లూథరన్ చర్చిలో ప్రార్థనలు



నాయుడుపేట: విన్నమాల జీసస్ గ్రేస్ చర్చి వద్ద సిస్టర్ వసంత కుమారి ఆధ్వర్యంలో..

వెలగని దీపం



సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితమంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీని అటకెక్కించేసింది. లబ్ధిదారులను భారీగా తగ్గించాలని పలు నిబంధనలతో దీపం–2 పథకాన్ని పక్కదారి పట్టిస్తోంది. సిలిండర్లు తీసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో సబ్సిడీ నగదు జమచేస్తామని చెప్పి జమ చేయకుండా దీపం–2 పథకాన్ని వెలగకుండా చేసింది.

సబ్సిడీ జమ కాలేదు



దీపం–2 పథకం వినియోగదారులకు గ్యాస్ సబ్సిడీ నగదు ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనలు అమలు కావడంలేదు. గ్యాస్ బుక్ చేసి రూ.850 చెల్లించా. ప్రభుత్వం జమ చేస్తామన్న నగదు ఖాతాల్లో పడలేదు. పథకం అమలుకు గ్యాస్ కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్ కూడా వేశా. కానీ సబ్సిడీ మాత్రం పడలేదు.

–చేశెట్టి విజయకుమార్, బంగారుపేట, వెంకటగిరి

మాటా తప్పారు



నాలుగురోజుల క్రితం గ్యాస్ బుక్‌చేసుకున్నా. అయితే తాజాగా ప్రభుత్వం అమలు చేసిన దీపం–2 గ్యాస్ సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమలేదు. గ్యాస్‌కు మాత్రం రూ.900 ఇచ్చాను. ప్రభుత్వం స్పందించి సకాలంలో చెల్లించాలి.

–పురుషోత్తం, చాపలపల్లి, దక్కిలి మండలం

మహిళలకు ఉచిత శిక్షణ



కిట్లను పంపిణీ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేటటౌన్: చాగణం లతితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని డీఎస్పీ చెంచుబాబు పేర్కొన్నారు. పట్టణంలో ట్రస్ట్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, మగ్గం, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం డీఎస్పీ ప్రారంభించారు. ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామయ్య మాట్లాడుతూ.. ఉచిత కుట్టు, మగ్గం, కంప్యూటర్ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈసందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఏఓ గళ్ల కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు మాతృ వియోగం



రాజమ్మ (ఫైల్)

ఓజిలి: మండలంలోని గ్రద్దగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మొక్కపాటి వెంకటప్రసాద్ తల్లి రాజమ్మ(80) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామంలో గురువారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆమె మృతిపై పార్టీ నేతలు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటగిరి(సైదాపురం): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన వెంకటగిరి పట్టణంలోని జగనన్న కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన సోమశేఖర్(42) జగనన్న కానీలో అనుమానాస్పదస్థితి పడి ఉన్నారు. ఈమేరకు సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు సోమశేఖర్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోసుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైష్ణవ ఆలయాలకు ప్రత్యేక బస్సులు

వాకాడు: పవిత్ర ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాలను సందర్శించడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.పెంచలయ్య తెలిపారు. బుధవారం ఆయన వాకాడులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ధనుర్మాసంలో పలు ఆలయాలు సందర్శించేందుకు భక్తుల సౌకర్యార్థం డిపో నుంచి బస్సులు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. అందులో కాణిపాకం, వేలూరు, శ్రీపురం బంగారు గుడి, కంచి, వేణుగోపాలస్వామి గుడి, నారాయణవనం, నాగాలాపురం, జొన్నవాడ, నరసింహకొండ, ఒంటిమిట్ట ఆలయాల సందర్శనార్థం ప్రత్యేక బస్సులు బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382887318ను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు, నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతల చొరవతో బుధవారం సాయంత్రం దుస్తులను పంపిణీ చేశారు. క్రిస్మస్ సందర్భంగా చిట్టమూరు మండలం ఎల్లసిరి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమారి, నాయుడుపేటకు చెందిన రిటైర్డ్ అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్, అధ్యాపకులు మనోజ్ దాతృత్వంతో ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ సూరిబాబు, న్యాయవాది నిరంజన్, ఆశ్రమ నిర్వాహకులు సునితా, బెన్నీ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేటటౌన్: వాజ్‌పేయి దేశం గర్వించదగ్గ నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం నాయకులు పెద్ద దర్గా సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. సీనియర్ నాయకులు డాక్టర్ రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, చిగురాకులు సురేంద్ర, కొప్పులు సుబ్రహ్మణ్యం, కంత్రాతి సుందరరావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటలో..

కోట: వాజ్‌పేయి శత జయంతిని కోటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రమేష్‌బాబు, వాసు, వెంకయ్య, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం



పౌష్టికాహారం, దుస్తులు ఇస్తున్న ప్రతినిధులు

గూడూరురూరల్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో బుధవారం వైజేపీ లయన్స్ క్లబ్ ద్వారా బాలింతలకు పౌష్టికాహారం, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ పట్టణ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాస్ట్ రీజియన్ చైర్మన్ ఎంజేఎఫ్ లయన్ ఆర్‌వీ రావు కుటుంబసభ్యుల దాతృత్వంతో అందజేశామన్నారు. వైజేపీ లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోపీనాథ్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కరువై.. బతుకు బరువై..

- ఒక్కొక్కటిగా మూతపడుతున్న పరిశ్రమలు
- వీధిన పడుతున్న కార్మికులు
- లబోదిబోమంటున్న కుటుంబీకులు

పెళ్లకూరు: టీడీపీ అధికారంలోకి వచ్చిందంటే కరువు, దారిద్ర్యం కవలపిల్లలుగా మారి ప్రజలకు అనేక కష్టాలు తప్పవని అనాదిగా వింటున్న నానుడి. ఈక్రమంలోనే ఒక్కోసారి వర్షాభావం వల్ల సాగునీరు లేక పంటలు ఎండిపోవడం, మూగజీవాలకు తాగునీరు లభించక పాడి రైతులు తమ పశువులను వధ శాలలకు విక్రయించడంతోపాటు తుపాన్లు, భారీ వర్షాలకు పంటలు నీట మునిగి తీవ్ర నష్టాలు మిగల్చడం. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల పలుచోట్ల పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు, ఉద్యోగులు ఉపాధి లేక వీధిన పడుతున్నారు. పరిశ్రమల్లో కష్టపడి పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న కార్మికులకు పరిశ్రమలన్నీ ఒక్కొక్కటిగా మూతపడుతుండడం వల్ల కార్మికులు వీధినపడుతున్నారు. 2014చంద్రబాబు పాలనాకాలంలో మండలంలోని జీలపాటూరు పంచాయతీలో వున్న బీజీ టెక్స్‌టైల్, పెన్నేపల్లిలోని బాలాజి ఊరగాయ పరిశ్రమ, శ్రీవారిశక్తి పేపర్ ప్రయివేట్ లిమిటెడ్ వరుసగా మూతపడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు పాలనలోనే పునబాక గ్రామంలో ఉన్న మరో పరిశ్రమ మూసివేసేందుకు సిద్ధంగా ఉండడంతో సర్వత్రా విమర్శలు గుప్పుమంటున్నాయి. అప్పట్లో జీలపాటూరు పంచాయతీ పరిధిలోని బీజే పరిశ్రమ మూతపడడంతో అక్కడ పనిచేస్తున్న 300మంది పైగా కార్మికులు వీధినపడ్డారు. అలాగే బాలాజీ ఊరగాయల పరిశ్రమ మూసేయడంతో వంద మందికి పైగా మహిళలు ఉపాధి కోల్పోయారు. అలాగే శ్రీవారిశక్తి పేపర్ పరిశ్రమ కూడా 2015లో మూసేయడంతో అక్కడ కార్మికులంతా వీధిన పడ్డారు.



మూతపడిన బీజే పరిశ్రమ(ఫైల్)

ప్రస్తుతం పునబాకలోని ఓ పరిశ్రమ తాత్కాలికంగా మూసేయడంతో అక్కడి కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

సంపద సృష్టిస్తాం నేతలు ఏమయ్యారు?

ఎన్నికల సమయంలో చంద్రబాబు అండ్ కో నేతలంతా మైక్‌లు చేతపట్టి సంపద సృష్టిస్తాం. పరిశ్రమలు నెలకొల్పి లక్షల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ప్రగల్భాలు పలికిన నేతలంతా అధికారంలోకి వచ్చాక ఏమైపోయారో అంటూ స్థానికులు విమర్శలు చేస్తున్నారు. గడిచిన ఆరు మాసాల పాలనలో కొత్త పరిశ్రమలు నెలకొల్పడం లేదుగానీ, ఉన్న పరిశ్రమలు మూసివేస్తుండడంపై ఉపాధి కరువై ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి పరిశ్రమలు మూసేస్తూ కార్మికులు వీధిన పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఈక్రమంలోనే మండలంలోని పలు పరిశ్రమలు మూతపడి పలువురు కార్మికులు వీధిన పడ్డారు. తగిన ఉత్పత్తి లేకపోవడం, డిమాండ్ తగ్గడం, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఇతర కారణాల వల్ల పలు పరిశ్రమలు మూసివేసేందుకు సిద్ధంగా వున్నట్లు తెలిసింది. అందువల్ల మరో మూడు పరిశ్రమలు మూసేందుకు సిద్ధంగా వున్నట్లు సమాచారం. కార్మికశాఖ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త పరిశ్రమలు నెలకొల్పాలి



ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. సంపద సృష్టిస్తాం.. అందరికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని చెప్పిన మాటలను నిలుపుకోవాలి. కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. –వెంకటేశ్వర్లు, చెంబేడు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి..



నిరుద్యోగులకు ప్రతినెలా భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు వెంటనే అమలు చేయాలి. ఉన్నత చదువులు చదివిన పలువురు యువతకు ఉపాధి లేక కష్టాలు పడుతున్న వారందరిని ప్రభుత్వం ఆదుకోవాలి.

–రాఘవయ్య, నందిమాల



పునబాకలోని మూసేసిన పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)



మూతపడిన ఊరగాయ పరిశ్రమ

రెండు వర్గాల ఘర్షణ

– పలువురికి గాయాలు



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వెంకటగిరిరూరల్: పొలం విషయమై రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో గ్రామానికి చెందిన పలువురికి, న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టు గాయపడ్డారు. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని మన్నూరుమిట్టలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు కాటూరు రామతులసి కథనం మేరకు..మన్నూరుకు చెందిన రామతులసికి సంబంధించి గ్రామంలో 3 ఎకరాల 23 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామం బీసీ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించేందుకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. గత కొన్ని నెలల క్రితం వివాదం చోటుచేసుకుందని ఘటనపై కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించింది. అయితే బుధవారం మళ్లీ తమ పొలంలోకి వచ్చి చెట్లను నరికే యత్నం చేసినట్లు ఆరోపించారు. బాలాయపల్లి పోలీసులకు మధ్యాహ్నం ఫిర్యాదు ఇచ్చి పొలం వద్దకు రాగా వారిపై ఆ గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడినట్లు తెలిపింది. 'న్యూస్' కవరేజ్ చేసుకునేందుకు సంఘటన స్థలానికి వెళ్లిన ఓ రిపోర్టర్‌పై దాడి చేయడంతో అతనితోపాటు మన్నూరుమిట్ట దళితవాడకు చెందిన ఒప్పతొట్టి రమణయ్య, చెన్నూరు కృష్ణమ్మ, గంప సంపూర్ణమ్మ, చీకటపల్లి గురవయ్య, చెన్నూరు వెంకటేశ్వర్లు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా మస్తాన్, రమణయ్యను తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ప్రత్యర్థి వర్గానికి చెందిన నలుగురు చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లగా వారిలో ఇద్దరిని రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై బాలాయపల్లి ఎస్ఐ గోపిని వివరణ కోరగా ఇరువర్గాలు పరస్పర ఫిర్యాదులు చేశాయని తెలిపారు.